# భయం

శ్రీ బి. పి. కరుణాకర్

గాలిలో తేలుతూ పదిగంటలు వినిపించాయి. తెరచిఉన్న కిటికీ తలుపుల వరకూ వచ్చి ఆగి పోయింది చీకటి. చల్లటి గాలి వీస్తుంది

చలపతి లేచి నుంచుని సిగరెట్ వెలిగించాడు. రాజు ఏదో పత్రిక తిరగవేస్తున్నాడు.

'రాజూ !' అన్నాడు చలపతి.

రాజు తలెత్తి చలపతి వంక చూశాడు.

'వెళ్దాం పద'

'అప్పుడే'

'అక్కడికి వెళ్ళేసరికి పన్నెండు దాటదూ'

'సరే'

రాజు పుస్తకం మూసి లేచి నుంచున్నాడు. రాను రాను హృదయంలో ఓమూల భయం చోటు చేసుకోసాగింది. చలపతి 'నేను రానూ నువ్వు వెళ్ళిరా' అందామనుకున్నాడు. అనలేకపోయాడు. అంటే, చలపతి దృష్టిలో తను పిరికివాడై పోతాడు. చలపతి ధైర్యవంతుడు; గంభీరంగా కనిపిస్తాడు.

చలపతి కిటికీ తలుపులుమూసి టార్చి తీసుకున్నాడు. గది తలుపుకు తాళంవేసి, రోడ్డు మీదకు వచ్చారు. చీకటి మత్తుగా జోగుతుంది.

'ఇక్కడ్నుంచి ఎన్ని మైళ్ళుంటుంది?' అడిగాడు రాజు.

'రెండు మైళ్ళు' అన్నాడు చలపతి.

ఇద్దరూ పక్కపక్కగా నడుస్తున్నారు. రోడ్డు మెలికలుతిరిగి దూరంగా పారిపోతోంది.

దయ్యాలంటే రాజుకు నమ్మకం లేదు అలా అని దేవుడిని కూడా నమ్మడు. కాని దయ్యాలంటే భయం ఉంది. ఒక రోజు మాట మీద మాట వచ్చి బెట్ పెట్టాడు చలపతి. 'ఈ ఊరు చివర పాడుపడిపోయిన బంగళాలో దయ్యాలున్నాయి' అన్నాడు,

రాజు నవ్వి 'నేను నమ్మను' అన్నాడు.

'చూపిస్తే?'

'నువ్ ఎప్పుడేనా చూశావా?'

'లేదు, విన్నాను. చూడాలని ఉంది, కాని ఒక్కడినే వెళ్లేందుకు జంకుతున్నాను. నువ్వు కూడా రాకూడదూ!'

'నేనా?'

'ఏం!'

'వస్తాను'

'హాత్ మిలావ్'

రాజు తనచేతిని చలపతి చేతికి అందిస్తుంటే గుండె జలదరించింది. ఆ స్పందన అలానే ఉంది.

చీకటి చిక్కగా కురుస్తోంది.

గాలి హోరులో రాజు మనసులో భయం తెగిన గాలిపటంలా అయిపోయింది. ఊరి చివర బంగళా ఊగుతోంది. నేను రానంటే, ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు కాని బావుండదు.

'ఇంకా ఎంత దూరం' అడిగాడు రాజు.

చలపతి రాజు ముఖంలోకి పరీక్షగా చూసి నవ్వాడు.

'కాళ్లు నొప్పెడుతున్నాయా'

'లేదు'

'వచ్చేసినట్లే'

దారి మసకగా కనిపిస్తుంది. బ్యాటరీ వెలిగించాడు. దూరంగా కుక్క ఏడుస్తున్న ధ్వని ఆగి ఆగి వినిపిస్తుంది. తారురోడ్డు వదలి సన్నటి బాటగుండా ముందుకు నడవసాగాడు. దూరంగా చీకట్లో తెల్లగా కనిపిస్తుంది మేడ. చింత చెట్లు మీంచి గాలి హోరు విరుచుకు పడ్తుంది. పేరు తెలీని పిట్ట అరుచుకుంటూ పారిపోయింది రాజు శరీరం జలదరించింది. చలపతి ముందుకు నడుస్తున్నాడు.

ఒకప్పుడు ఆ భవనంలో ఒకావిడ ఉండేది. ఆవిడ పేరు ఏమిటో ఎవరకూ తెలియదు. అపురూప సౌందర్యవతి అని చెప్పుకుంటారు. ఇల్లు వదలి ఎప్పుడూ బైటకు వచ్చేది కాదు. ఆవిడ పసతనాన్నో ఏటి భర్త చనిపోయాడు. చాల సంవత్సరాల తర్వాత ఆమె ఆత్మహత్య చేసుకుంది ఎందుకు చేసుకుందో ఎవరకూ తెలియదు. ఆ తర్వాత అక్కడ ఎవరూ ఉండేవారు కాదు. క్రమంగా పాడుబడిపోయింది. గోడలమీద చెట్లు మొలిచాయి. మేడమీద పెంకులు కాలంలోఇంకిపోయాయి.

చలపతి ముందుకు నడిచి ఆగాడు. ఎండుటాకులు గాలికి చెదరిపోతున్నాయి. రాజు మెల్లగా నడుస్తూ చలపతి ప్రక్కన నుంచున్నాడు. చలపతి తలుపు నెట్టాడు. కిర్రుమని తలుపులు తెరుచుకున్నాయి రాజు హృదయస్పందన క్రమక్రమంగా వేగం కాసాగింది. చెమటలు పడ్తున్నాయి. కాలి కింద ఎండిపోయిన పుల్ల విరిగింది. పక్కకు తిరిగితే, పాము చరచరా పాకిపోతుంది. రాజు చలపతి చేయి పట్టుకున్నాడు. 'భయ పడకు, ఏం చేయదు' అన్నాడు చలపతి.

గదంతా బూజు పట్టి ఉంది. గబ్బిలాయిలు కీచుమని అరుస్తూ అటూ ఇటూ తిరుగుతున్నాయి. దూరంగా రైలుకూత వినిపించి ఆగిపోయింది పక్షి రెక్కలు కొట్టుకొంటున్న ధ్వని. గది ప్రక్కగా మేడమీదకు మెట్లున్నాయి. కచ్చు పగిలిపోయి ఉంది గదులకు తలుపులు లేవు గదిలో ఓమూల ఎత్తుగా గడ్డి పరచి ఉంది. పక్కనే పగిలిపోయిన ఎర్రటి గాజులు వాడిపోయిన మల్లెచెండు.

(తరువాయి 11 వ పేజీ)

## ★ భ య ం ★

(13 వ పేజీ తరువాయి)

మెట్లవైపు నడిచాడు చలపతి. చెక్క మెట్లమీద అంగుళం మందాన దుమ్ము ఉంది. చలపతి ఆగి సిగిరెట్ తీశాడు. అగ్గిపుల్ల వెలగ లేదు. మరొకటి వెలిగించాడు. సిగిరెట్ వెలిగింది. మెట్లు ఎక్కబోతూ ఆగిపోయాడు చలపతి. మేడమీద ఎవరో అటూ ఇటూ కదిలిన చప్పుడు. వెనకకు తిరిగి రాజు ముఖం లోకి పరీక్షగా చూశాడు. రాజు ఏదో అన బోయి ఆగిపోయాడు. పెదాలు విపరీతంగా వణుకుతున్నాయి.

'భయం వేస్తోందా ?' అడిగాడు చలపతి

రాజు సమాధానం ఇవ్వలేదు.

చలపతి ఒక్కో మెట్టు శబ్దం కాకుండా ఎక్కాడు. మేడమీద ఒకటే గది ఉంది. గోడలకు పెచ్చులు ఊడిపోయాయి. గది శుభ్రంగా తుడిచి ఉంది. గది మధ్యలో ఒక చిరిగిపోయిన పాత టవలు పరచి ఉంది. టవలుమీద అక్కడక్కడా రక్తం మరకలు వరండాలో ఎవరో కదిలిన చప్పుడైంది. దూరంగా కారు ఆగిన ధ్వని వినిపించి ఆగి పోయింది. చలపతి వరండాలోకి వచ్చాడు. ఎదురుగా ఉన్న రాయి కొట్టుకుని తూలి క్రిందపడి తమాయించుకున్నాడు. టార్చి చేతిలోంచి జారి క్రింద పడింది. క్రింద పడు తూనే ఆరిపోయింది. వెతికి తీసుకున్నాడు చలపతి. బటన్ నొక్కితే వెలగడంలేదు.

'చలపతీ' అన్నాడు రాజు

'ఊఁ'

'వెలగడం లేదు ?'

'ఊహుఁ'

'ఎలా'

రాజు కంఠంలో భయం నిండుగా అలుము కుంది.

చలపతి మాట్లాడలేదు. పెదాలమధ్య సిగిరెట్ విప్పులో దమ్ములాగినప్పుడల్లా అతని ముఖం గంభీరంగా కనిపిస్తుంది.

'ఏమైంది అడిగాడు రాజు.

'బల్బు...'

'బల్బు ?'

'పగిలిపోయిందనుకుంటాను.'

రెండుక్షణాలు ఆగి 'కేండిల్స్ తేలేదా ? అడిగాడు రాజు.

'తీసుకు వద్దామని డ్రాయర్లో పెట్టేసి మర్చి పోయాను.'

పైన ఎవరో పరుగెత్తిన ధ్వని

గాజుల గల గల

రాజు గోడకు ఆనుకుని నుంచున్నాడు. భయంతో నిలువెల్లా వొణికి పోతున్నాడు చెమటతో షర్టు తడిసిపోయింది

'ఇక వెళ్ళిపోదాం' అన్నాడు రాజు.

చివరిసారిగా చూస్తాను. టార్చి వెలుగు తుందో లేదో' అన్నాడు చలపతి.

ఎవరో స్త్రీ దగ్గరకు వచ్చి ఆనుకుని ముఖంలో ముఖం పెట్టి నవ్వినట్లనిపించింది రాజుకు.

'బాబోయ్' పొలికేక పెట్టి ముందుకు తూలాడు రాజు. ఎవరో తనను బలంగా పట్టుకున్నట్లనిపించింది చొక్కా చిరిగి పోతుంది. గాలిలో తేలిపోతున్నట్లనిపిస్తుంది, కేకలు పెడ్తున్నాడు. చలపతి చేతిలో టార్చి క్రిందపడిపోయింది. రాజు అరిచిన అరుపులకు గుండెలు అవిసిపోయాయి. పిచ్చిగా భయం కమ్ముకుంది. నరాలన్నీ బిగుసుకుపోసాగాయి. కాళ్ళు వొణుకుతున్నాయి. రాజు కదలలేక అరుస్తున్నాడు. చలపతి బైటకు పరుగెత్తాడు. టప టప ధ్వని కాలు జారింది. మెట్లు విరిగి కూలిపోయాయి చలపతి అరచిన కేక ప్రతి ధ్వనిలో కలసి ఆగిపోయింది.

పెద్ద పెద్ద అడుగులు వేసుకుంటూ ఎవరో పరుగెత్తారు.

దూరంగా ఒకటి కొట్టారు.

ముకుందం పరుగెత్తుకుంటూవచ్చి కారులో కూర్చున్నాడు. మనిషి ఆపాద మస్తకం వొణికి పోతున్నాడు.

'ఏం జరిగింది ?' అడిగాడు డ్రైవింగ్ సీట్లో కూర్చున్న నారాయణ.

'ముందు కారు పోనీయ్'

కారు కదిలింది.

ముకుందం గుండెలు అలుపు తీర్చుకుంటు న్నాయి. తారురోడ్డుమీద హెడ్‌లైట్స్ వెల్తురులో కారు జారిపోసాగింది. వణుకు తున్న పెదాల మధ్య సిగిరెట్ పెట్టి వెలిగించాడు ముకుందం ప్రక్కనే ఉన్న వాటర్ బాటిల్ మూత తీసి నీళ్ళు కొద్దిగా త్రాగి తిరిగి మూత పెట్టాడు.

'దయ్యాలున్నాయి' అన్నాడు ముకుందం

'అసలేం జరిగింది ?' అడిగాడు నారాయణ

హెడ్‌లైట్స్ వెలుగు తిరిగి తారురోడ్డును వెదుక్కుంటున్నాయి

'చెప్పు'

'మేడలోపలకు వెళ్ళాను. బాగా పొడు బడిపోయింది. లోపల పైకి పోయేందుకు మెట్లున్నాయి. ఎక్కుదామనుకునేంతలో పైగదిలోనుండి నా హృదయం పగిలిపోయేట్లు పెద్దగా అరుపు వినిపించింది. ఆ తర్వాత ఎవరో పరుగెట్టిన ధ్వని నేను చూస్తూండగానే మెట్లన్నీ కూలిపోయాయి.' అన్నాడు ముకుందం.

నారాయణ మాట్లాడలేదు

ముకుందం వాటర్ బాటిల్ మూతతీసి మరి నాలుగు గుటకలు మింగి. వాటర్ బాటిల్ మూతపెట్టి కళ్ళుమూసుకుని జారగిలబడ్డాడు.

ఊరును పరుగెత్తుకుంటూ ముందుకు రాసాగింది.

## విధి వక్రించింది

(12 వ పేజీ తరువాయి)

యింకా ఆశ్వాలు తీరలేదు. అందుకే యీ వేదం

రెండవసారి...' అని అరుస్తున్నాడు.

ఆ కేక, ఆ వాణి చెవులకు భయంకరంగా వినవచ్చింది. నిర్మలమైన ఆకాశంలో కలవరం బయలుదేరింది. యెక్కడో పిడుగు పడ్డయింది. పట్టపగలే నక్షత్రం రాలింది యెక్కడో.

'మూడవ సారి...' అని అరుస్తున్నాడు.

ఆ కేక సత్యనారాయణ గారి చెవులకు విని పించకముందే ఆయన ప్రాణవాయువు ఆకాశంలో కలిసిపోయింది.